# తెలంగాణ వెన్నెల వాక్కు

జాతీయ దినపత్రిక

TELANGANAVENNELA WAKKU

TGTEL/25/A0871



విలేకరులు కావలెను

ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొస్తూ శరవేగంగా రాజకీయ పరిస్థితులపై వాస్తవ కథనాలు అందిస్తూ అనతి కాలంలోనే ప్రజాదరణ పొందిన తెలంగాణ వెన్నెల వాక్కు లో రాష్ట్ర వ్యాప్తంగా స్టాఫర్లు, ఆర్సీ ఇంచార్జీలు, మండల రిపోర్టర్లు కావలెను. అనుభవజ్ఞులకు ప్రాధాన్యం.. కొత్త వారికి ప్రోత్సాహం

మీరు పని చేయాలనుకుంటున్న కేంద్రాల్లో ఖాళీల వివరాల కోసం

7386173123 నంబర్‌ను సంప్రదించండి..

డి. యోగేష్ కుమార్, సీఈవో



హైదరాబాద్ | సంపుటి : 02 | సంచిక :65 | 21-09- 2026 | సోమవారం | పేజీలు: 4 | వెల:03/-


# డీజే మోత.. ప్రాణాలపై పోటు!

- వినాయక నిమజ్జన వేళ చెవులు పగిలే శబ్దాలు.. గుండెపై తీవ్ర ఒత్తిడి
- యువకుడి మృతి ఘటనతో మళ్లీ తెరపైకి డీజే దుష్ప్రభావం..
- రాష్ట్రవ్యాప్తంగా మృతులపై అధికారిక లెక్కలు కరవు
- పోలీసుల హెచ్చరికలు బేఖాతర్..
- వృద్ధులు, చిన్నారులు, గుండెజబ్బులున్న వారికి పొంచి ఉన్న ముప్పు




హైదరాబాద్: వినాయక నిమజ్జన శోభాయాత్రల్లో భక్తి కంటే డీజే మోతే ప్రధాన ఆకర్షణగా మారుతున్న పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయి. గంటల తరబడి భారీ శబ్దంతో సౌండ్ సిస్టమ్స్ మోగించడం వల్ల ప్రజల ఆరోగ్యంపై ప్రభావం పడే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా గుండెజబ్బులు, అధిక రక్తపోటు ఉన్నవారు, వృద్ధులు, చిన్నారులు అధిక శబ్దానికి దూరంగా ఉండాలని సూచిస్తున్నారు.

ఈ ఏడాది హైదరాబాద్ ముషీరాబాద్‌లో వినాయకుడి ఆగమన ఊరేగింపులో 19 ఏళ్ల యువకుడు కుప్పకూలి మృతి చెందిన ఘటన డీజే శబ్దాలపై మరోసారి చర్చకు తెరలేపింది. డీజే శబ్దమే తన కుమారుడి మృతికి కారణమని కుటుంబ సభ్యులు ఆరోపించినప్పటికీ.. మృతికి అసలు కారణం డీజేనేనని పోలీసులు అధికారికంగా నిర్ధారించలేదు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా డీజే కారణంగా ఎంతమంది మరణించారనే ప్రశ్నకు ప్రస్తుతం అధికారిక సమగ్ర గణాంకం లేదు.

అధిక శబ్దం శరీరంలో ఒత్తిడిని పెంచి రక్తపోటు,


మిగతా వివరాలు రెండో పేజీలో..


# విద్యార్థుల యూనిఫాంలకు కొత్త రంగులు

## వచ్చే ఏడాది పాఠశాలలు తెరిచిన రోజే యూనిఫాం, సామగ్రి అందాలి: సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించే యూనిఫాంలను మరింత ఆకర్షణీయమైన రంగుల్లో రూపొందించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. యూనిఫాం డిజైన్లలో వైవిధ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. విద్యార్థులకు యూనిఫాంలు, ఇతర సామగ్రి పంపిణీపై అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు.

ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులకు ఒక జత యూనిఫాం పంపిణీ పూర్తయిందని అధికారులు సీఎంకు తెలిపారు. రెండో జతను ఈ నెలాఖరులోగా అందజేస్తామని చెప్పారు. కేజీబీవీ,


మిగతా వివరాలు 3వ పేజీలో..


# పారిశ్రామికవేత్తల గుప్పిట్లో దేశం బందీ

- విద్యార్థులు ప్రశ్నించడాన్ని వ్యవస్థ కోరుకోవడం లేదు
- దేశంలో ద్వేషాన్ని తరిమికొట్టే శక్తి యువతకే ఉంది
- విద్యారంగంపై కేంద్రం నిర్లక్ష్యం చూపుతోంది
- ఛాత్రోం కీ గూంజ్‌లో కేంద్ర ప్రభుత్వంపై రాహుల్ గాంధీ విమర్శలు



ఇండోర్: దేశంలోని వ్యవస్థ కొంతమంది రాజకీయ నేతలు, పారిశ్రామికవేత్తల చేతుల్లో బందీగా మారిందని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. దేశ భవిష్యత్తును నిర్ణయించాల్సిన యువత ప్రశ్నించకుండా ఉండాలని వ్యవస్థ కోరుకుంటోందని అన్నారు. విద్యార్థులు ప్రశ్నించడం, వాస్తవాలను తెలుసుకోవడం, ప్రభుత్వ నిర్ణయాలను పరిశీలించడం ప్రజాస్వామ్యానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు.

మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో శనివారం నిర్వహించిన 'ఛాత్రోం కీ గూంజ్' కార్యక్రమంలో విద్యార్థులతో రాహుల్ గాంధీ సమావేశమై వివిధ అంశాలపై మాట్లాడారు.

దేశ అభివృద్ధిలో యువత పాత్ర అత్యంత కీలకమని రాహుల్ గాంధీ అన్నారు. ఏ దేశమైనా బలపడాలంటే యువతకు నాణ్యమైన విద్య, ఆలోచించే స్వేచ్ఛ, ప్రశ్నించే హక్కు, సమాన అవకాశాలు ఉండాలని


మిగతా వివరాలు రెండో పేజీలో..


# నేను బహుజనుల బాణాన్ని

## కాంగ్రెస్‌ను గద్దె దించితేనే బహుజన రాజ్యం

## రేవంత్, కేసీఆర్, మోదీతో పోరాడుతా

## జూరాల నుంచి నీళ్లు తెచ్చి పాలమూరు--రంగారెడ్డికి 10 లక్షల ఎకరాలకు సాగునీరు



కోస్గి: తాను ఎవరి బాణాన్ని కాదని, బహుజనుల బాణాన్నని, యువత యుద్ధ నినాదాన్నని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. బహుజన రాజ్యం రావాలంటే కాంగ్రెస్‌ను గద్దె దించాల్సిందేనని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, ప్రధాని నరేంద్ర మోదీతో రాజకీయంగా పోరాడుతానని ప్రకటించారు. ముఖ్యమంత్రి బలవంతుడిననే అహంకారంతో వ్యవహరిస్తున్నారని విమర్శించిన ఆమె.. బలమైన సర్పం చలిచీమల చేతిలో చిక్కి చనిపోయినట్లే ఆయనకు కూడా పరాభవం తప్పదని వ్యాఖ్యానించారు.

కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గి కాలేజీ గ్రౌండ్‌లో ఆదివారం తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో నిర్వహించిన 'పాంచజన్య సంకల్ప సభ'లో కవిత ప్రసంగించారు. సభకు భారీగా ప్రజలు, పార్టీ కార్యకర్తలు తరలివచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలోనే ఈ సభ నిర్వహించడంతో రాజకీయంగా ప్రాధాన్యం ఏర్పడింది.

తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ వంటి పార్టీలు ఉన్నప్పటికీ ప్రజల బతుకుల్లో ఆశించిన మార్పు రాలేదని


మిగతా వివరాలు రెండో పేజీలో..


# దళితుల భూమి అంగుళం కూడా తీసుకోం

## మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి భరోసా

హైదరాబాద్ బ్యూరో

దళితులు మరియు గిరిజనుల భూములను లాక్కోవడం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ విధానం కాదని, వారి భూమిలో అంగుళం కూడా ప్రభుత్వం తీసుకోదని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం దళితుల భూములకు సంపూర్ణ రక్షణగా నిలుస్తుందని, ఎవరూ ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఒక ప్రకటన ద్వారా కీలక భరోసా ఇచ్చారు.

రెవెన్యూ శాఖ మంత్రిగా మాటిస్తున్నా..

"రెవెన్యూ శాఖ మంత్రిగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి తరఫున దళిత కుటుంబాలకు నేను స్పష్టమైన హామీ ఇస్తున్నాను. మీ అంగుళం భూమి కూడా ప్రభుత్వం లాక్కోదు. మీ భూమిని తీసుకునే ఆలోచన కూడా ఈ ప్రభుత్వానికి లేదు. ఎవరైనా ఏదైనా చెప్పారని భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదు. ప్రజా ప్రభుత్వం మీకు ఎల్లప్పుడూ అండగా ఉంటుంది" అని మంత్రి స్పష్టం చేశారు. దళితులు, గిరిజనులు, బడుగు బలహీన వర్గాల ప్రజల ఆశీస్సులతోనే ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని పేర్కొన్నారు.




రాజకీయ ప్రయోజనాల కోసం విషప్రచారం దళితుల భూముల విషయంలో కొంతమంది రాజకీయ లబ్ధి కోసం కావాలనే భయాందోళనలు సృష్టిస్తూ విషప్రచారం చేస్తున్నారని మంత్రి మండిపడ్డారు. దళితులను రెచ్చగొట్టి తమ స్వార్థ ప్రయోజనాలు పొందాలని చూస్తున్నారని, అలాంటి ప్రచారాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గతంలో అధికారంలోకి వస్తే


మిగతా వివరాలు రెండో పేజీలో..


# పాక్‌లో సైనిక కాన్వాయ్‌పై ఉగ్రదాడి

## ఐఈడీ పేలుడులో ఆరుగురు సైనికులు మృతి.. ఉగ్రవాదులపై భద్రతా దళాల ఎదురుదాడులు



ఇస్లామాబాద్: పాకిస్తాన్‌లో భద్రతా దళాల కాన్వాయ్‌పై ఉగ్రవాదులు దాడికి పాల్పడ్డారు. ఖైబర్ పఖ్తూన్‌ఖ్వా ప్రావిన్స్‌లోని హంగూ జిల్లాలో సెప్టెంబర్ 17న ఈ ఘటన చోటుచేసుకుంది. భద్రతా దళాల కాన్వాయ్‌ను లక్ష్యంగా చేసుకుని రహదారిపై అమర్చిన పేలుడు పదార్థం (ఐఈడీ) పేలడంతో ఆరుగురు సైనికులు మృతి చెందినట్లు పాకిస్తాన్ సైన్యం మీడియా విభాగం ఐఎస్‌పీఆర్ వెల్లడించింది.

ఈ దాడి అనంతరం భద్రతా దళాలు ఖైబర్ పఖ్తూన్‌ఖ్వాలోని పలు ప్రాంతాల్లో ఉగ్రవాదుల స్థావరాలపై ఆపరేషన్లు చేపట్టాయి. నార్త్ వజీరిస్తాన్, హంగూ జిల్లాల్లో నిర్వహించిన వేర్వేరు ఆపరేషన్లలో పది మంది ఉగ్రవాదులను హతమార్చినట్లు ఐఎస్‌పీఆర్ తెలిపింది. ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొంది.

పాకిస్తాన్‌లో ముఖ్యంగా ఖైబర్ పఖ్తూన్‌ఖ్వా, బలూచిస్థాన్ ప్రాంతాల్లో ఇటీవలి కాలంలో


మిగతా వివరాలు 3వ పేజీలో..

# ఏకత్వం వర్సెస్ ఏకరూపత!

## - చారిత్రక కోణంలో యూసిసి..!
## -జనసంఘ్ తొలినాళ్ల వైఖరి నుండి నేటి ఎన్డీయే నిర్ణయాల వరకు

భారత రాజకీయాంబరంలో 'ఉమ్మడి పౌర స్మృతి' చట్టం దశాబ్దాలుగా అత్యంత ప్రాధాన్యత కలిగిన, తీవ్రంగా చర్చించబడుతున్న సంక్లిష్టమైన అంశం. భారతీయ జనతా పార్టీ యొక్క భావజాలంలో, వారి ప్రచారంలో, వారి వివిధ ఎన్నికల ప్రణాళికలలో ఈ ఉమ్మడి పౌర చట్టం ఒక బలమైన నాందిగా నిలిచింది. 2029 నాటికి తమ పరిపాలనలో ఉన్న 21 రాష్ట్రాల్లో ఈ చట్టాన్ని అమల్లోకి తెస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం ఈ అంశానికి మళ్లీ సరికొత్త ప్రాముఖ్యతను చేకూర్చింది. అయితే, చరిత్ర పుటల్లోకి తొంగిచూస్తే, ఈ అంశంపై నేటి అధికార పార్టీ, దాని పూర్వరూపమైన భారతీయ జనసంఘ్, అలాగే వారి సైద్ధాంతిక మాతృసంస్థ అయిన రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ల తొలినాళ్ల వైఖరులు చాలా భిన్నంగా ఉండేవి. ముఖ్యంగా, ఆ సంస్థ రెండవ అధినేత మాధవ సదాశివ గోల్వాల్కర్ 1972లోనే ఉమ్మడి పౌర చట్టం రూపకల్పనపై స్పష్టమైన అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ, "భిన్నత్వంలో ఏకత్వం" మాత్రమే భారతదేశానికి ప్రాణపదమని ఉద్ఘాటించారు.

**గోల్వాల్కర్ దృష్టిలో ఉమ్మడి చట్టం... భారతదేశ వైవిధ్యం**

1972 ఆగస్టు నెలలో ఆ సంస్థ వారపత్రికలో ప్రచురితమైన గోల్వాల్కర్ యొక్క ఒక సుదీర్ఘమైన ముఖాముఖి, తదనంతర కాలంలో ఒక హిందీ పుస్తకంలో ప్రచురించబడింది. ఈ సంభాషణలో ఆయన వెల్లడించిన అనేక కీలక అభిప్రాయాలు నేటి నాయకుల కఠిన వైఖరికి పూర్తి భిన్నంగా ఉండటం గమనార్హం.

జాతీయ సమైక్యతను, జాతీయ భావాన్ని పెంపొందించడానికి ఉమ్మడి పౌర చట్టం అనేది తప్పనిసరిగా ఉండాలా అని ప్రశ్నించినప్పుడు, ఆయన "లేదు" అని స్పష్టంగా సమాధానమిచ్చారు. భారతదేశం శతాబ్దాలుగా విభిన్న సంస్కృతులు, వేర్వేరు ఆచారాలు ఉన్నప్పటికీ ఒక బలమైన మరియు ఏకీకృత దేశంగా వర్ధిల్లిందని ఆయన గుర్తుచేశారు. "మనకు కావలసింది సమాజంలో సామరస్యం. మైత్రి భావం తప్ప, బలవంతంగా రుద్దే ఏకరూపత కాదు" అని ఆయన స్పష్టమైన అభిప్రాయాన్ని వెల్లడించారు. అంతేకాకుండా, ముస్లిం సమాజంలో ఉన్న బహుభార్యాత్వం వంటి విభిన్న అంశాలపై మాట్లాడుతూ, "యంత్రబద్ధమైన లేదా బలవంతపు రీతిలో ఉమ్మడి పౌర చట్టాన్ని రుద్దే ప్రయత్నాలు ఏమాత్రం సరికావు" అని స్పష్టం చేశారు. ఆయా సమాజాల ప్రజలు తమంతట తాముగా తమ వ్యక్తిగత ఆచారాలలో సంస్కరణలు తీసుకువచ్చి, బహుభార్యాత్వం తమకు మంచిది కాదనే నిర్ణయానికి వచ్చేవరకు ఓపిక పట్టాలని చెప్పారు. వారు ఆ నిర్ణయానికి వస్తే తాను సంతోషిస్తానని, అంతే తప్ప తన సొంత అభిప్రాయాలను వారిపై బలవంతంగా రుద్దడానికి ఇష్టపడనని ఆయన తేల్చిచెప్పారు. సమాజంలో ఉన్న విభిన్న జీవన విధానాల వైవిధ్యాన్ని కాపాడటానికే ఆయన ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు.

**జనసంఘ్ నుండి నేటి పాలకపక్షం వరకు పరిణామక్రమం**

స్వాతంత్ర్యం వచ్చిన ప్రారంభ దశాబ్దాలలో ఆ సంస్థ కానీ, జనసంఘ్ కానీ ఉమ్మడి పౌర చట్టాన్ని తమ ప్రాథమిక ఎజెండాగా మార్చుకోలేదు. 1955లో సాంప్రదాయ హిందూ చట్టాలను క్రమబద్ధీకరించడానికి హిందూ చట్ట సవరణ బిల్లును తీసుకువచ్చినప్పుడు, జనసంఘ్ దానిని తీవ్రంగా వ్యతిరేకించింది. ప్రజామోదం లేకుండా, ప్రజల నుండి ఎలాంటి స్పష్టమైన తీర్పు తీసుకోకుండా తీసుకువచ్చిన చర్యగా దానిని విమర్శించింది.

?1957, 1962 ఎన్నికల ప్రణాళికలలో జనసంఘ్ ఆ బిల్లును రద్దు చేయాలని కోరింది తప్ప ఉమ్మడి చట్టం ప్రస్తావన తేలేదు. 1967లో మొదటిసారిగా ఉమ్మడి చట్టం డిమాండ్ వచ్చినప్పటికీ, 1971 మరియు 1977 ఎన్నికల్లో అది మళ్లీ కనుమరుగైంది. 1980లో ఏర్పడిన ప్రస్తుత పాలక పార్టీ మొదటి ఎన్నికల ప్రణాళికలో కూడా దీని ప్రస్తావన లేకపోవడం విశేషం. అయితే, 1985లో వచ్చిన ఒక విడాకుల న్యాయపోరాట తీర్పు భారత రాజకీయాల్లో ఒక పెద్ద మలుపుగా మారింది. గోల్వాల్కర్ 1973లోనే మరణించగా, 1987లో నాయకత్వం మారింది. ఆ తర్వాతే పార్టీ తన వైఖరిని కఠినతరం చేసుకుని ఉమ్మడి చట్టంపై తీవ్ర ఒత్తిడి తీసుకురావడం ప్రారంభించింది. 1989, 1991, 1996, 1998లలో ఈ డిమాండ్ ను ప్రతిపాదించినప్పటికీ, కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్య పక్షాల ఒత్తిడి కారణంగా ఈ అంశాన్ని పక్కన పెట్టాల్సి వచ్చింది. 2004, 2009, 2014, 2019, 2024 ఎన్నికల ప్రకటనల ద్వారా ఉమ్మడి పౌర చట్టం పార్టీ యొక్క అత్యంత ప్రధాన వాగ్దానంగా మారింది.

**గిరిజన సంస్కృతి ... అమలులోని ఆచరణాత్మక సవాళ్లు**

భారతదేశంలో ఉమ్మడి పౌర చట్టాన్ని అమలు చేయడం కేవలం ఒక చట్టపరమైన అంశం మాత్రమే కాదు, అది సామాజికంగా అత్యంత క్లిష్టమైనది, సంక్లిష్టమైనది. ముఖ్యంగా, దేశ జనాభాలో 8.6 శాతానికి పైగా ఉన్న గిరిజన తెగల ప్రజలు తమదైన ప్రత్యేక సంస్కృతి, వివాహ ఆచారాలు, వారసత్వ పద్ధతులను కలిగి ఉన్నారు. వివాహ వయస్సు, ఆచారాలు, వారసత్వ హక్కులు, విడాకుల పద్ధతులు వంటి అనేక అంశాలు ప్రతి గిరిజన తెగకు, ప్రాంతానికి వేర్వేరుగా ఉంటాయి. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ యొక్క అనుబంధ గిరిజన క్షేత్ర సంస్థలు కూడా గిరిజన ఆచారాల పరిరక్షణపై విస్పష్టమైన అభ్యంతరాలు వ్యక్తం చేశాయి. దీని కారణంగానే, ఇటీవల ఉత్తరాఖండ్ రాష్ట్రంలో ఉమ్మడి పౌర చట్టాన్ని తీసుకువచ్చినప్పుడు గిరిజన సమాజాలను దాని పరిధి నుండి మినహాయించాల్సి వచ్చింది. ఇది 1972లోనే గోల్వాల్కర్ ప్రస్తావించిన సామాజిక వైవిధ్య ప్రాముఖ్యతను స్పష్టంగా ఎత్తిచూపుతోంది.

ప్రస్తుత పాలకపక్షం తన సుదీర్ఘ రాజకీయ ప్రయాణంలో మూడింటిని ప్రధాన వాగ్దానాలుగా ప్రజల ముందుకు తెచ్చింది: అయోధ్య రామాలయ నిర్మాణం, 370వ ప్రకరణ రద్దు, మరియు ఉమ్మడి పౌర స్మృతి అమలు. ఇప్పటికే మొదటి రెండు వాగ్దానాలను నెరవేర్చిన కేంద్ర ప్రభుత్వం, మూడోసారి అధికారంలోకి వచ్చిన వేళ ఈ ఉమ్మడి చట్టాన్ని అసంపూర్తిగా వదిలేయడానికి ఏమాత్రం సిద్ధంగా లేదు. అయితే, చట్టాలను ఏకరూపం చేసే క్రమంలో భారతదేశంలోని విభిన్న సంస్కృతులు, ప్రత్యేక గిరిజన సంప్రదాయాలు, భావజాల వైవిధ్యాన్ని దెబ్బతీయకుండా చూడటం ప్రజాస్వామ్య వ్యవస్థల బాధ్యత. గోల్వాల్కర్ ఉద్ఘాటించినట్లుగా, బలవంతపు చట్టాల కంటే "సమాజంలో సామరస్య భావం" పెంపొందడమే జాతీయ సమైక్యతకు అసలైన పునాది అనే నిత్యసత్యాన్ని పాలకులు తప్పక గుర్తుంచుకోవాల్సి ఉంది.



వెంక గారి భూమయ్య
సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ
9848559863

# హారతి వెలుగును కళ్లకు అద్దుకోవడం ఎందుకు..

## ఇందులో ఇంతటి ఆధ్యాత్మిక భావమా?

దేవుడి దర్శనం పూర్తయింది.. హారతి మొదలైంది. పూజారి స్వామివారి ముందు హారతి చూపిస్తే భక్తులు రెండు చేతులను ఆ జ్వాల వైపు చాచి, ఆ చేతులను కళ్లకు అద్దుకుంటారు. చిన్నప్పటి నుంచి చూస్తున్న ఈ ఆచారం వెనుక అసలు భావం ఏమిటి? హారతి వేడిని చేతులకు తీసుకుని కళ్లకు అద్దుకోవడమేనా.. లేక అందులో మరేదైనా ఆధ్యాత్మిక సందేశం ఉందా? హిందూ ఆరాధనా విధానంలో దీపానికి ఎంతో ప్రత్యేకమైన స్థానం ఉంది. చీకటిని తొలగించి వెలుగును ప్రసరించే దీపం.. అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానాన్ని ప్రసాదించే దైవత్వానికి ప్రతీకగా భావిస్తారు. పూజ ముగింపులో ఇచ్చే హారతి కూడా అదే భావాన్ని భక్తుడి మనసులో నింపుతుంది.

హారతి జ్వాల వైపు చేతులు చాచి, ఆ చేతులను కళ్లకు అద్దుకోవడం వెనుక ఒక అందమైన ఆధ్యాత్మిక భావం ఉంది. 'దేవుడి సన్నిధిలో చూసిన ఈ పవిత్ర వెలుగు నా చూపులోనూ ఉండాలి.. నా ఆలోచనల్లోనూ వెలుగు ఉండాలి' అనే




భావంతో భక్తుడు దానిని స్వీకరిస్తాడు. కళ్లతో ప్రపంచాన్ని చూసినట్టే.. మనసుతో కూడా మంచిని చూడాలనే అంతరార్థాన్ని ఈ ఆచారం గుర్తుచేస్తుంది.

మన చూపు ఎటువైపు వెళ్తే మన ఆలోచనలు కూడా చాలాసార్లు అటువైపే వెళ్తాయి. అందుకే హారతి వెలుగును కళ్లకు అద్దుకోవడం కేవలం ఒక ఆచారం కాకుండా.. మన చూపు, మన ఆలోచన, మన జీవితం మంచి మార్గంలో సాగాలని కోరుకునే భక్తి భావంగా చూడవచ్చు.

ఆలయంలో హారతి తీసుకునే సమయంలో కొందరు కళ్లను మూసుకుని దేవుడిని తలచుకుంటారు. ఆ కొన్ని క్షణాలు బయట ప్రపంచాన్ని మరిచి మనసును దేవుడిపై నిలిపే సమయంగా మారుతాయి. హారతి జ్వాల చిన్నదే అయినా.. అది మనలో నింపే విశ్వాసం మాత్రం ఎంతో పెద్దది.

ఈ ఆచారాన్ని పిల్లలకు కూడా అర్థమయ్యేలా చెప్పాలి. 'హారతి తీసుకుంటే అదృష్టం వస్తుంది' అని మాత్రమే చెప్పడం కంటే.. 'ఈ వెలుగులాగే మన జీవితం కూడా మంచి పనులతో వెలుగుతూ ఉండాలి' అని చెప్పినప్పుడు ఆ ఆచారం వెనుక ఉన్న విలువ వారికి అర్థమవుతుంది.

దేవుడి ముందు వెలిగించే దీపం బయట చీకటిని మాత్రమే తొలగించదు.. మనలోని అజ్ఞానం, అహంకారం, చెడు ఆలోచనలను తొలగించుకోవాలనే సంకల్పాన్ని కూడా గుర్తుచేస్తుంది. అందుకే హారతి సమయంలో భక్తుడు చేతులు మాత్రమే చాచడం కాదు.. తన మనసును కూడా దైవానికి సమర్పిస్తున్నాడని భావించవచ్చు.

తర్వాతసారి ఆలయంలో హారతి తీసుకునేటప్పుడు ఒక్క క్షణం ఆగి చూడండి.. ఆ చిన్న జ్వాలలో మీకు కనిపించేది కేవలం వెలుగేనా? లేక 'నా జీవితం కూడా వెలుగులా ఉండాలి.. నా చూపు మంచిని చూడాలి.. నా చేతులు మంచి పనులు చేయాలి' అనే దైవ సందేశమా?



సీనియర్ జర్నలిస్ట్
యోగేష్ కుమార్

## డీజే మోత.. ప్రాణాలపై పోటు!

గుండె వేగం వంటి వాటిపై ప్రభావం చూపే అవకాశం ఉందని వైద్య నిపుణులు చెబుతున్నారు. దీర్ఘకాలం భారీ శబ్దానికి గురైతే వినికిడి సమస్యలు, నిద్రాభంగం, మానసిక ఒత్తిడి వంటి సమస్యలు కూడా తలెత్తవచ్చని హెచ్చరిస్తున్నారు.

డీజే శబ్దాలపై పోలీసులు గతంలోనే హెచ్చరికలు జారీ చేసినా కొన్ని నిమజ్జన ఊరేగింపుల్లో నిబంధనలు ఉల్లంఘిస్తున్న ఘటనలు వెలుగుచూస్తున్నాయి. భక్తి పేరుతో ఇతరుల ఆరోగ్యానికి ముప్పు కలిగించే స్థాయిలో శబ్దం చేయకుండా నిర్వాహకులు, యువత సంయమనం పాటించాల్సిన అవసరం ఉంది.

భక్తి ఉండాలి.. బీభత్సం కాదు.

సందడి ఉండాలి.. శబ్ద కాలుష్యం కాదు.

వినాయకుడి నిమజ్జనం ఆనందంగా సాగాలి.. విషాదంగా కాదు.

## పారిశ్రామికవేత్తల గుప్పిట్లో దేశం బందీ

పేర్కొన్నారు. విద్యార్థుల్లో కుతూహలం, ప్రేమ, అణకువ, సహనం, నిజాయతీ వంటి లక్షణాలు ఉంటాయని చెప్పారు. సమాజంలో నెలకొన్న ద్వేషాన్ని తొలగించడంలో యువత కీలక పాత్ర పోషించగలదని అన్నారు.

ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్‌తో పాటు పారిశ్రామికవేత్తలు గౌతమ్ అదానీ, ముకేశ్ అంబానీలను ప్రస్తావిస్తూ రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. దేశ వ్యవస్థపై విద్యార్థులు ప్రశ్నలు సంధిస్తున్నారని, అయితే అలాంటి ప్రశ్నలను వ్యతిరేకించే వర్గాలు కూడా ఉన్నాయని అన్నారు. మోదీ, భాజపాకు మద్దతుగా నిలిచేవారిని ఉద్దేశించి ఆయన 'అంధ భక్తులు' అనే పదాన్ని ఉపయోగించారు.

దేశంలో విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యలను కూడా రాహుల్ గాంధీ ప్రస్తావించారు. దేశవ్యాప్తంగా సుమారు 10 లక్షల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, లక్ష పాఠశాలలు మూతపడ్డాయని ఆయన పేర్కొన్నారు. విద్యకు ప్రభుత్వ బడ్జెట్‌లో కేటాయింపుల వాటా తగ్గిందని విమర్శించారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో విద్యకు 4.6 శాతం బడ్జెట్ కేటాయించగా, ప్రస్తుతం అది 2.6 శాతానికి పడిపోయిందని ఆయన ఆరోపించారు.

విద్యార్థులు కేవలం ఉద్యోగాల కోసం చదవడం కాకుండా సమాజాన్ని అర్థం చేసుకోవాలని రాహుల్ గాంధీ సూచించారు. తమ చుట్టూ జరుగుతున్న పరిణామాలను ప్రశ్నించాలని, ఏ అంశాన్నైనా గుడ్డిగా నమ్మకుండా వాస్తవాలను పరిశీలించాలని అన్నారు. ప్రశ్నించే యువతే ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయగలదని పేర్కొన్నారు.

దేశంలో ద్వేషాన్ని తగ్గించేందుకు యువత ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రేమ, సహనం, పరస్పర గౌరవం ద్వారా సమాజంలో మార్పు తీసుకురావచ్చని అన్నారు. విద్యార్థుల్లో ఉన్న ఆలోచనా శక్తిని అణచివేయడం కాకుండా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

ప్రస్తుత రాజకీయ, సామాజిక వ్యవస్థపై తన అభిప్రాయాలను విద్యార్థులతో పంచుకున్న రాహుల్ గాంధీ.. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం సహజమైన ప్రక్రియ అని అన్నారు. ప్రభుత్వాలు తీసుకునే నిర్ణయాలపై యువతకు అవగాహన ఉండాలని, దేశ భవిష్యత్తుకు సంబంధించిన అంశాలపై వారు చర్చించాలని సూచించారు.

విద్యారంగంపై గణాంకాల ప్రస్తావన

విద్యారంగానికి సంబంధించిన పలు గణాంకాలను రాహుల్ గాంధీ తన ప్రసంగంలో ప్రస్తావించారు. ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలు, పాఠశాలల మూసివేత, బడ్జెట్ కేటాయింపుల తగ్గుదల వంటి అంశాలను ఆయన కేంద్ర ప్రభుత్వ విధానాలతో అనుసంధానిస్తూ విమర్శలు చేశారు. విద్యకు తగిన ప్రాధాన్యం ఇవ్వకపోతే దేశ భవిష్యత్తుపై ప్రభావం పడుతుందని అన్నారు.

యువతే దేశ భవిష్యత్తు

యువత దేశానికి అతిపెద్ద శక్తి అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. విద్యార్థులు భయపడకుండా ప్రశ్నించాలని, తమ హక్కులు, బాధ్యతలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. దేశంలో మార్పు రావాలంటే యువత చురుకైన పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని అన్నారు.

రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. విద్యారంగం, ప్రభుత్వ విధానాలు, పారిశ్రామికవేత్తల ప్రభావం, యువత పాత్ర తదితర అంశాలపై ఆయన చేసిన వ్యాఖ్యలు కార్యక్రమంలో ప్రధానంగా నిలిచాయి

## దళితుల భూమి అంగుళం కూడా తీసుకోం

దళితులకు 3 ఎకరాల భూమి ఇస్తామని హామీ ఇచ్చి విస్మరించిన వారి మాటలను ఎవరూ నమ్మవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

భూములకు సంబంధించి రికార్డుల పరిశీలన, సర్వేలు, భూ వివాదాల పరిష్కారం వంటి ప్రక్రియలను ప్రజల భూములను లాక్కోవడానికి చేస్తున్న చర్యలుగా చూడటం సరికాదని మంత్రి అన్నారు. భూములపై ప్రజలకు ఉన్న హక్కులను స్పష్టంగా నమోదు చేయడం, భూ వివాదాలను పరిష్కరించడం, భూ హక్కులకు రక్షణ కల్పించడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని వివరించారు. ప్రభుత్వం తీసుకునే ప్రతి చర్య చట్టబద్ధంగా, పారదర్శకంగా ఉంటుందని స్పష్టం చేశారు.

దేశంలోనూ, రాష్ట్రంలోనూ పేదలు, దళితులకు భూములు పంపిణీ చేసి హక్కులు కల్పించిన చరిత్ర కాంగ్రెస్‌కే ఉందని పొంగులేటి గుర్తుచేశారు. గతంలో ఇందిరమ్మ ప్రభుత్వ హయాంలో తెలంగాణ ప్రాంతంలో దళితులకు సుమారు 25 లక్షల ఎకరాల భూములు పంపిణీ చేయగా, గిరిజనులకు దాదాపు 2 లక్షల ఎకరాల పోడు భూములపై హక్కులు కల్పించామని వివరించారు. భూమి లేని వారికి భూమి ఇవ్వడం, హక్కులు లేని వారికి హక్కులు కల్పించడమే కాంగ్రెస్ విధానమని అన్నారు.

రీ-సర్వే ద్వారా భూముల వాస్తవ పరిస్థితులను గుర్తించి దళితులకు, గిరిజనులకు హక్కులు కల్పిస్తున్నామని చెప్పారు. సూర్యాపేట జిల్లా నూతనకల్, మద్దిరాల ప్రాంతాల్లోని 15 రెవెన్యూ గ్రామాలలో, అలాగే మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం నారాయణపురంలో దశాబ్దాలుగా ఉన్న భూ సమస్యలకు ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపిందని తెలిపారు. భూమిపై హక్కులు కల్పించడం ద్వారా వారికి ప్రభుత్వ పథకాలు, ఇతర ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. దళిత కుటుంబాలు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని పునరుద్ఘాటించారు.

# యూపీఐపై కొత్త రుసుముల మోత..

## ఉమ్మడి ఆదిలాబాద్‌లో ఎవరికి ఎంత?

**అక్టోబర్ 15 నుంచి కొత్త ఎండీఆర్ విధానం**
**రూ.2 వేల వరకు యథాతథంగా ఉచితం..**
**ఆపై కొన్ని చెల్లింపులకు 0.4 శాతం, మరికొన్నింటికి రూ.5**




నిర్మల్, సెప్టెంబర్: యూపీఐ చెల్లింపుల వినియోగం రోజురోజుకూ పెరుగుతున్న వేళ.. అక్టోబర్ 15, 2026 నుంచి కొన్ని వ్యాపారి లావాదేవీలకు కొత్తగా వ్యాపారి రాయితీ రుసుము (ఎండీఆర్) అమలులోకి రానుంది. అయితే ప్రతి యూపీఐ చెల్లింపుపైనా రుసుము ఉండదు. వ్యక్తి నుంచి వ్యక్తికి జరిగే చెల్లింపులు, సాధారణంగా రూ.2,000 వరకు చేసే వ్యాపారి చెల్లింపులు ఉచితంగానే కొనసాగుతాయి.

**రూ.2 వేలు దాటితే 0.4 శాతం**

రూ.2,000 దాటిన సాధారణ వ్యాపారి లావాదేవీలకు 0.4 శాతం ఎండీఆర్ వర్తిస్తుంది. ఈ రుసుమును వ్యాపారి భరించాలి. రూ.75,000 లేదా అంతకంటే ఎక్కువ లావాదేవీలకు గరిష్ఠంగా రూ.300 మాత్రమే వసూలవుతుంది. ఉదాహరణకు రూ.5,000 చెల్లింపుపై రూ.20, రూ.25,000పై రూ.100, రూ.50,000పై రూ.200 ఎండీఆర్ వర్తిస్తుంది.

**కొన్ని సేవలకు రూ.5**

ఇంధనం, విద్యుత్, పురపాలక నీటి బిల్లులు, టెలికాం సేవలు, బీమా ప్రీమియాలు, రైల్వే టికెట్లు వంటి నిర్దిష్ట విభాగాల్లో రూ.2,000 దాటిన అర్హత కలిగిన లావాదేవీలకు 0.4 శాతానికి బదులుగా స్థిరంగా రూ.5 ఎండీఆర్ ఉంటుంది. ఉదాహరణకు రూ.3,000 లేదా రూ.10,000 విద్యుత్ బిల్లు చెల్లించినా ఈ విభాగంలో వర్తించే ఎండీఆర్ రూ.5గానే ఉంటుంది.

**షేర్లు, మ్యూచువల్ ఫండ్లకు 0.02 శాతం**

మ్యూచువల్ ఫండ్లు, సెక్యూరిటీలు, స్టాక్ బ్రోకర్లు, డీలర్లు తదితర మూలధన మార్కెట్ చెల్లింపులకు 0.02 శాతం ఎండీఆర్ వర్తిస్తుంది. దీనికి గరిష్ఠ పరిమితి రూ.300గా ఉంటుంది.

**ఉమ్మడి ఆదిలాబాద్‌పై ప్రభావం**

ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో కిరాణా దుకాణాలు, మెడికల్ షాపులు, పెట్రోల్ బంకులు, హోటళ్లు, విద్యాసంస్థలు, బిల్లుల చెల్లింపుల్లో యూపీఐ వినియోగం విస్తరించింది. దీంతో కొత్త విధానంపై వ్యాపారులు, వినియోగదారులు అవగాహన పెంచుకోవాల్సి ఉంది. అయితే ఎండీఆర్ వినియోగదారుడి ఖాతా నుంచి నేరుగా కట్ చేసే చార్జీ కాదని, సంబంధిత వ్యాపారి చెల్లించాల్సిన రుసుమని స్పష్టం చేస్తున్నారు. అందువల్ల అక్టోబర్ 15 నుంచి ప్రతి యూపీఐ లావాదేవీపై రూ.5 రుసుము వస్తుందనే ప్రచారాన్ని నమ్మాల్సిన అవసరం లేదు.

## బాబాపూర్ సర్పంచ్ పడిగెల లక్ష్మి-అంజయ్య దంపతులను పరామర్శించిన కూచాడి



లక్ష్మణచాంద, సెప్టెంబర్ 20 (తెలంగాణ వెన్నెల వాక్కు): లక్ష్మణచాంద మండల పరిధిలోని బాబాపూర్ గ్రామ సర్పంచ్ పడిగెల లక్ష్మి, ఆమె భర్త అంజయ్య గత కొద్ది రోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న నిర్మల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కూచాడి శ్రీహరిరావు ఆదివారం వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని, అందుతున్న వైద్య చికిత్సలను అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బాధితులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొంద్ర నరేష్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ నారా గౌడ్, తునికి నారాయణ, ప్రతాపరెడ్డి, గంగాధర్ గౌడ్, రాజేశ్వర్, పోన్కల్ గంగారెడ్డి, ఉపసర్పంచ్ సురేష్ రెడ్డి పాల్గొన్నారు.

## బాసర పుణ్యక్షేత్రంలో భక్తులకు అందుబాటులోకి ఉచిత బస్సు సేవలు

బాసర, సెప్టెంబర్ 20 (తెలంగాణ వెన్నెల వాక్కు): బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి దర్శనార్థం విచ్చేసే భక్తుల సౌకర్యార్థం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) రూ. 25 లక్షలతో సమకూర్చిన నూతన ఉచిత బస్సు సేవలు ఆదివారం లాంఛనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ఈవో అంజనీదేవి, ఎస్బీఐ మేనేజర్ జి. అశోక్ కుమార్, ఆలయ అర్చకులు బస్సుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రైల్వే స్టేషన్, బస్టాండ్ నుండి ఆలయానికి వచ్చే యాత్రికులకు ఈ ఉచిత రవాణా సదుపాయం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని ఈవో తెలిపారు. భక్తుల సంక్షేమార్థం బస్సును బహూకరించిన ఎస్బీఐ అధికారులకు ఆలయ కమిటీ ధన్యవాదాలు తెలిపింది.



## ముధోల్ శిశుమందిర్‌లో మట్టి గణపతికి విద్యార్థుల ఘన వీడ్కోలు




ముధోల్, సెప్టెంబర్ 20 (తెలంగాణ వెన్నెల వాక్కు): పర్యావరణ పరిరక్షణ సందేశంతో ముధోల్‌లోని శ్రీ సరస్వతి శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో ప్రతిష్ఠించిన మట్టి వినాయకుడికి ఆదివారం విద్యార్థులు, ఆచార్యులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఏడు రోజుల పాటు శాస్త్రోక్తంగా పూజలందుకున్న గణనాథుడిని పూలతో ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌పై ఉంచి పురవీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ భజన పాటలకు నృత్యాలు చేస్తూ ఊరేగింపు సాగించారు. ప్రధానాచార్యులు సారథి రాజు మాట్లాడుతూ పర్యావరణానికి హాని కలగకుండా మట్టి విగ్రహాలను పూజించి ఆదర్శంగా నిలిచామన్నారు. అనంతరం స్థానిక చెరువులో గణపతిని భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు.

## బాసర మండలం ఓని పాఠశాలలో తల్లిదండ్రుల సమీక్షా సమావేశం




బాసర, సెప్టెంబర్ 20 (తెలంగాణ వెన్నెల వాక్కు): బాసర మండల పరిధిలోని ఓని గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల విద్యా ప్రగతి, నడవడికపై తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. హెచ్ఎం శ్రీధర్ మాట్లాడుతూ విద్యార్థులకు ఇంట్లో సెల్‌ఫోన్లు ఇవ్వకుండా వారి చదువుపై శ్రద్ధ వహించాలని సూచించారు. ఇటీవల నిర్వహించిన విద్యాశాఖ తనిఖీల్లో పాఠశాల విద్యార్థులు చురుకైన అభ్యసన సామర్థ్యాలను కనబరిచారని తెలిపారు. తల్లిదండ్రులు ఉపాధ్యాయులతో సమన్వయం చేసుకుంటూ పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు మౌనిక, వాలంటీర్ యోగిత, ఉపసర్పంచ్ పురుషోత్తం, తల్లిదండ్రులు పాల్గొన్నారు

# నేను బహుజనుల బాణాన్ని

కవిత విమర్శించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా యువతకు తగిన ఉద్యోగాలు లభించడం లేదని అన్నారు. ఇప్పటికీ తల్లిదండ్రులు ఇచ్చే డబ్బుపైనే అనేకమంది యువత ఆధారపడాల్సిన పరిస్థితి ఉందని పేర్కొన్నారు. యువత ఆలోచనలను ప్రోత్సహించేందుకు తమ పార్టీ కట్టుబడి ఉందని, వారి వ్యాపార ఆలోచనలను బట్టి రూ.2 లక్షల నుంచి రూ.20 కోట్ల వరకు రుణాలు అందించే విధానాన్ని ప్రతిపాదిస్తున్నామని చెప్పారు.

తమ పార్టీ ప్రకటించిన 'పాంచజన్యం' ఐదు ప్రధాన అంశాల చుట్టూ రూపొందిందని కవిత తెలిపారు. ఉచిత విద్య, ఉచిత వైద్యం, ఉపాధి, వ్యవసాయం, సామాజిక న్యాయానికి ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. ప్రతి గ్రామానికి ఒక పాఠశాల, ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలని అన్నారు. తెలంగాణలో ప్రతి బిడ్డను చదివించే బాధ్యత ప్రజలు తమ పార్టీకి అవకాశం ఇస్తే తీసుకుంటానని పేర్కొన్నారు.

విద్యారంగ పరిస్థితులపై కవిత ప్రభుత్వాన్ని విమర్శించారు. గురుకులాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించారు. పాలిటెక్నిక్ విద్యపై తీసుకుంటున్న నిర్ణయాలపై ప్రశ్నలు సంధించారు. తెలంగాణ యువతకు రాష్ట్రంలోనే విద్య, ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

వైద్య రంగంపై కూడా కవిత తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేదలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రస్తావించారు. అధికారంలోకి వస్తే తీవ్రమైన అనారోగ్యానికి గురైనప్పటికీ పేదలకు రూపాయి ఖర్చు లేకుండా వైద్యం అందించే బాధ్యత ప్రభుత్వమే తీసుకోవాలని తమ పార్టీ విధానంగా పేర్కొన్నారు. విద్య, వైద్యం కోసం అవసరమైతే భారీగా నిధులు ఖర్చు చేయాల్సిందేనని అన్నారు.

జూరాల నుంచి నీళ్లు తెస్తా

పాలమూరు ప్రాంతంలో కృష్ణా, తుంగభద్ర, ఇతర నదులు ఉన్నప్పటికీ ప్రజలకు సాగు, తాగునీటి సమస్యలు ఎందుకు కొనసాగుతున్నాయని కవిత ప్రశ్నించారు. జూరాల నుంచి నీటిని తరలించే అవకాశాలు ఉన్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తాము అధికారంలోకి వస్తే జూరాల నుంచి నీటిని తీసుకుని ఇబ్రహీంపట్నం వరకు పాలమూరు, రంగారెడ్డి జిల్లాల్లో 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తానని ప్రకటించారు. అది చేయలేకపోతే తన పేరు మార్చుకుంటానని సవాల్ చేశారు.

రైతులు యూరియా, నీరు, విద్యుత్, రైతు భరోసా, మద్దతు ధర, బోనస్ కోసం ఇబ్బందులు పడుతున్నారని కవిత ఆరోపించారు. గతంలో ఇచ్చిన హామీలకు భిన్నంగా ప్రస్తుత పరిస్థితులు ఉన్నాయని విమర్శించారు.

సామాజిక న్యాయమే లక్ష్యం

తెలంగాణలో సామాజిక అన్యాయం కొనసాగుతోందని కవిత ఆరోపించారు. బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనారిటీలు, మహిళలకు జనాభా నిష్పత్తికి అనుగుణంగా రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ముదిరాజ్, ముస్లిం, నేతన్న, గీతన్న తదితర వర్గాలకు తగిన ప్రాతినిధ్యం దక్కాలని చెప్పారు.

తాను కాంగ్రెస్ వదిలిన బాణాన్నని కొందరు, బీఆర్ఎస్ వదిలిన బాణాన్నని మరికొందరు వ్యాఖ్యానిస్తున్నారని కవిత అన్నారు. తాను మాత్రం "బహుజనుల బాణాన్ని.. యువజనుల యుద్ధ నినాదాన్ని" అని ప్రకటించారు. అంబేడ్కర్ వాదం, జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే ఆశయాలతో ముందుకు సాగుతున్నానని తెలిపారు.

మహిళలకు రాజకీయాల్లో మరిన్ని అవకాశాలు రావాలని కవిత అన్నారు. ఎవరి మద్దతు లేకుండానే ఒక మహిళ రాజకీయంగా ఎదగగలదని నిరూపిస్తానని చెప్పారు. తెలంగాణలో మహిళల రాజకీయ ప్రాతినిధ్యాన్ని పెంచాల్సిన అవసరం ఉందన్నారు.

"కాంగ్రెస్‌ను గద్దె దించాలి"

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా తప్పించుకుంటోందని కవిత ఆరోపించారు. మహబూబ్‌నగర్ జిల్లాలో కాంగ్రెస్‌కు ప్రజలు పెద్ద సంఖ్యలో ఎమ్మెల్యే స్థానాలు ఇచ్చినా ప్రజల సమస్యలు పరిష్కారం కాలేదని విమర్శించారు. ఇసుక, మట్టి, ఇందిరమ్మ ఇళ్ల వ్యవహారాల్లో అవకతవకలు జరుగుతున్నాయని ఆమె ఆరోపణలు చేశారు.

ఉద్యోగులు, ఉద్యమకారులు, ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోలేదని కవిత అన్నారు. ప్రజలు ఈ పరిస్థితిని గమనించాలని, బహుజన రాజ్యం కోసం కొత్త రాజకీయ ప్రత్యామ్నాయాన్ని నిర్మించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.

తమ పార్టీ ఎవరి వ్యక్తిగత రాజకీయ ప్రయోజనాల కోసం కాదని, తెలంగాణ ప్రజల కోసం పనిచేస్తుందని కవిత పేర్కొన్నారు. విద్య, వైద్యం, ఉపాధి, వ్యవసాయం, సామాజిక న్యాయం అనే ఐదు అంశాలను కేంద్రంగా చేసుకుని పాంచజన్య రాజకీయ ప్రయాణాన్ని కొనసాగిస్తామని తెలిపారు.

## విద్యార్థుల యూనిఫాంలకు కొత్త రంగులు



మోడల్ స్కూల్ విద్యార్థులకు ఇప్పటికే రెండు జతల యూనిఫాంలు పంపిణీ చేసినట్లు వివరించారు. విద్యార్థులందరికీ నోటు పుస్తకాల పంపిణీ పూర్తయిందని అధికారులు తెలిపారు. ప్రభుత్వ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలోని విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు, కటోరాలు, స్పూన్లు, కప్పులు, కార్పెట్లు, బెడ్‌షీట్లు, టవళ్లు కూడా పంపిణీ చేసినట్లు వెల్లడించారు.

వచ్చే విద్యా సంవత్సరం పాఠశాలలు ప్రారంభమైన రోజునే విద్యార్థులకు యూనిఫాం, ఇతర సామగ్రి అందేలా ఇప్పటి నుంచే కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న విద్యార్థుల సంఖ్యకు అదనంగా మరో 10 శాతం మంది చేరే అవకాశం ఉన్నందున, అందుకు అనుగుణంగా ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు.

ఈ ఏడాది పంపిణీ చేసిన యూనిఫాంలు, ఇతర సామగ్రి నాణ్యతపై తల్లిదండ్రుల నుంచి సంతృప్తి వ్యక్తమైందని అధికారులు సీఎంకు తెలిపారు. సమీక్షలో ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్‌రెడ్డి, ఎంపీ వేం నరేందర్‌రెడ్డితో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

తెలంగాణ వెన్నెల వాక్కు
జాతీయ దినపత్రిక
TELANGANAVENNELA WAKKU
TGTEL/25/A0871



# ముధోల్ గణేష్ నిమజ్జన శోభాయాత్రకు 500 మందితో పటిష్ఠ బందోబస్తు:

### రామాలయంలో సార్వజనిక గణపతికి ప్రత్యేక పూజలు చేసి శోభాయాత్రను ప్రారంభించిన ఎస్పీ



ముధోల్, సెప్టెంబర్ 20 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ముధోల్ మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన గణేష్ నిమజ్జన శోభాయాత్ర అత్యంత వైభవంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 500 మంది సిబ్బందితో పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. జిల్లా ఎస్పీ డాక్టర్ జి. జానకి షర్మిల ఐపీఎస్ స్థానిక జీవన్ ఫంక్షన్ హాల్‌లో పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించి దిశానిర్దేశం చేశారు. అనంతరం పట్టణంలోని రామాలయంలో ప్రతిష్ఠించిన సార్వజనిక వినాయకుడికి ప్రత్యేక పూజలు, హారతి నిర్వహించి 'గణపతి బప్పా మోరియా' నినాదాల నడుమ శోభాయాత్రను ప్రారంభించారు. ప్రధాన కూడళ్ల వద్ద సీసీ కెమెరాల నిఘా, పికెటింగ్‌లు, ట్రాఫిక్ మళ్లింపు చర్యలను స్వయంగా పర్యవేక్షించారు. కులమతాలకు అతీతంగా సామరస్యపూర్వకంగా పండుగ జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో భైంసా ఏఎస్పీ సాయికిరణ్, నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్, ముధోల్ సీఐ రవీందర్ నాయక్, ఎస్సై బిట్ల పెర్సిస్ పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జన శోభాయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



ముధోల్, సెప్టెంబర్ 20 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ముధోల్ మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన గణేష్ నిమజ్జన శోభాయాత్రలో స్థానిక ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ పాల్గొన్నారు. ముందుగా రామాలయంలో కొలువుదీరిన సార్వజనిక గణపతికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం పట్టణంలోని పలు వీధుల్లో ప్రతిష్ఠించిన వినాయక మండపాలను సందర్శించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ నిర్వాహకులు, యువజన సంఘాల సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. శోభాయాత్రను శాంతియుతంగా, క్రమశిక్షణతో నిర్వహించుకోవాలని కోరారు. ఎమ్మెల్యే వెంట ముధోల్ సర్పంచ్ ఎజాజోద్దీన్, బోరిగాం సర్పంచ్ కల్లెడ కిష్టయ్య, వీడీసీ అధ్యక్షుడు విఠల్, పోతన్న, సతీష్ రెడ్డి పాల్గొన్నారు.

## ముధోల్‌లోనే మకాం వేసి నిమజ్జనాన్ని పర్యవేక్షించిన ఎస్పీ జానకి షర్మిల



ముధోల్, సెప్టెంబర్ 20 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ముధోల్ నియోజకవర్గ కేంద్రంలో వినాయక నిమజ్జన వేడుకలు ప్రశాంతంగా, సకాలంలో పూర్తయ్యేలా నిర్మల్ జిల్లా ఎస్పీ డాక్టర్ జి. జానకి షర్మిల స్వయంగా ముధోల్‌లోనే మకాం వేసి బందోబస్తును క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ఉదయం బ్రాహ్మణ గల్లీలోని గణేష్ మండపాన్ని సందర్శించి పూజలు నిర్వహించిన ఎస్పీ, అనంతరం మసీద్ చౌక్‌లో ఉంటూ శోభాయాత్ర కదలికలను నిరంతరం సమీక్షించారు. సాయంత్రం వేళ వర్షం కురిసినప్పటికీ శోభాయాత్ర సాఫీగా సాగేలా సిబ్బందికి తగిన సూచనలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలీసులు పూర్తి అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఎస్పీ స్వయంగా రంగంలోకి దిగి పర్యవేక్షించడంతో నిమజ్జన శోభాయాత్ర ప్రశాంతంగా కొనసాగింది.

## గణేష్ నిమజ్జనంలో హైటెన్షన్ వైర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి:



నిర్మల్, సెప్టెంబర్ 20 (తెలంగాణ వెన్నెల వాక్కు):
వర్షాల నేపథ్యంలో వినాయక విగ్రహాల తరలింపు, నిమజ్జన శోభాయాత్రల సమయంలో విద్యుత్ తీగలు, హైటెన్షన్ వైర్ల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ డాక్టర్ జి. జానకి షర్మిల ఐపీఎస్ ప్రజలకు, ఉత్సవ నిర్వాహకులకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం నిర్మల్ పట్టణంలో విగ్రహాన్ని తరలిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు హైటెన్షన్ విద్యుత్ వైరు తగిలి ఒక వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన అత్యంత బాధాకరమన్నారు. ఇలాంటి విషాదాలు పునరావృతం కాకుండా వాహనాలపై విగ్రహాలను తీసుకెళ్లేటప్పుడు విద్యుత్ తీగలు తగలకుండా తగిన ఎత్తును చూసుకోవాలని, కర్రలు లేదా రక్షణ సామగ్రితో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. విద్యుత్ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ నిమజ్జనాలు పూర్తి చేసుకోవాలని కోరారు.

# లక్కీడ్రాలో అఖండ బ్రహ్మచారి గణేష్ లడ్డూను దక్కించుకున్న డాక్టర్ కిరణ్



ముధోల్, సెప్టెంబర్ 20 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ముధోల్ మండల కేంద్రంలోని చైతన్య యూత్ ఆధ్వర్యంలో కొలువుదీరిన అఖండ బ్రహ్మచారి గణపతి మండపం విశేష ప్రసాదం లడ్డూను లక్కీ డ్రా ద్వారా స్థానిక ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ దేశెట్టివార్ కిరణ్ సొంతం చేసుకున్నారు. గత ఏడు రోజులుగా భక్తిశ్రద్ధలతో పూజలందుకున్న స్వామివారి సన్నిధిలో ఆదివారం వేద పండితుడు ప్రణీత్ మహారాజ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చైతన్య యూత్ అధ్యక్షుడు దప్కల్ సాయి, సభ్యులు డాక్టర్ కిరణ్‌ను శాలువాతో ఘనంగా సత్కరించి గణపతి లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో చైతన్య యూత్ సభ్యులు బాబా, డాంగే రమాకాంత్ పటేల్, మనీష్, సాయి, చందు సింగ్, యోగేష్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## నిర్మల్ స్వప్న హాస్పిటల్‌లో అత్యాధునిక క్యాథ్ ల్యాబ్ ప్రారంభం

### గుండె సంబంధిత చికిత్సలు స్థానికంగానే అందుబాటులోకి రావడం శుభపరిణామం



నిర్మల్ టౌన్, సెప్టెంబర్ 20 (తెలంగాణ వెన్నెల వాక్కు):
నిర్మల్ పట్టణంలోని స్వప్న మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన అత్యాధునిక క్యాథ్ ల్యాబ్ (జఖ్ష్త్ర ఌఖఎ) సెంటర్‌ను నిర్మల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కూచాడి శ్రీహరిరావు ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఆసుపత్రికి చేరుకున్న ఆయనకు యాజమాన్యం, వైద్య బృందం సాదర స్వాగతం పలికారు. అనంతరం డాక్టర్ నాలం శశికాంత్ క్యాథ్ ల్యాబ్ ద్వారా అందుబాటులోకి రానున్న అధునాతన చికిత్సలు, కార్డియాక్ ఎమర్జెన్సీ సేవల వివరాలను వివరించారు. ఈ సందర్భంగా కూచాడి శ్రీహరిరావు మాట్లాడుతూ.. గుండె సంబంధిత అత్యవసర వైద్యం కోసం స్థానిక ప్రజలు ఇతర సుదూర నగరాలకు వెళ్లే శ్రమ తప్పి, నిర్మల్‌లోనే కార్పొరేట్ స్థాయి చికిత్సలు లభించడం గొప్ప పరిణామమన్నారు. ప్రజారోగ్యానికి మేలైన సేవలు అందిస్తున్న డాక్టర్ శశికాంత్‌ను, ఆసుపత్రి యాజమాన్యాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది మరియు నాయకులు పాల్గొన్నారు.

## కౌట్ల (కె)లో పిడుగుపాటుకు 6 గేదెలు మృతి: రూ. 4.5 లక్షల నష్టం



నిర్మల్ రూరల్, సెప్టెంబర్ 20 (తెలంగాణ వెన్నెల వాక్కు):
నిర్మల్ రూరల్ మండల పరిధిలోని కౌట్ల (కె) గ్రామ శివారులో ఆదివారం సాయంత్రం కురిసిన వర్షానికి పిడుగుపడి ఆరుగురు రైతులకు చెందిన ఆరు మేలుజాతి గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి. గ్రామానికి చెందిన రైతులు వేముల మోహన్, వేముల నరేష్, మీరా రాజేశ్వర్, కంకుడాల చిన్నబాబు, మూడ భీమన్నలకు చెందిన గేదెలు మేత మేస్తుండగా ఈ ప్రమాదం సంభవించింది. ఒక్కో గేదె విలువ రూ. 60 వేల నుంచి రూ. 80 వేల వరకు ఉంటుందని, ఆకస్మిక పిడుగుపాటుతో మొత్తం రూ. 4.50 లక్షల మేర తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లిందని అన్నదాతలు కన్నీరుమున్నీరయ్యారు. సమాచారం అందుకున్న నిర్మల్ రూరల్ తహశీల్దార్ ప్రభాకర్, పశువైద్యాధికారి డాక్టర్ రాణి, రూరల్ ఎస్సై లింబాద్రి ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. బాధిత రైతులను ప్రభుత్వం తక్షణమే పరిహారం అందించి ఆదుకోవాలని సర్పంచ్ దుమాల రాజు, ఉపసర్పంచ్ రఘు కోరారు.

# బహుజన రాజ్యాధికార సాధనే జేఏసీ లక్ష్యం: జిల్లా అధ్యక్షుడు యాటకారి సాయన్న



దిలావర్‌పూర్, సెప్టెంబర్ 20 (తెలంగాణ వెన్నెల వాక్కు):
సమాజంలో 90 శాతం ఉన్న బహుజన వర్గాలైన బీసీ, ఎస్సీ, ఎస్టీలలో రాజకీయ చైతన్యం పెంపొందించి వారిని నాయకులుగా తీర్చిదిద్దడమే జేఏసీ ప్రధాన లక్ష్యమని జిల్లా అధ్యక్షుడు యాటకారి సాయన్న ముదిరాజ్ స్పష్టం చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని పోచమ్మ దేవాలయం వద్ద నిర్వహించిన బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. డాక్టర్ విశారదన్ మహారాజ్ నాయకత్వంలో బహుజనుల రాజ్యాంగబద్ధ రిజర్వేషన్ల రక్షణ, హక్కుల సాధన మరియు రాజ్యాధికార సాధన దిశగా పోరాటాలు సాగిస్తామన్నారు. అనంతరం దిలావర్‌పూర్ మండల తాత్కాలిక కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల గౌరవ అధ్యక్షుడిగా మ్యాడాజీ నారాయణ, కన్వీనర్‌గా మాజీ సర్పంచ్ మోర స్వామి, కో-కన్వీనర్‌గా తూర్పు లక్ష్మణ్, మండల కేంద్ర కన్వీనర్‌గా చింతకింది ప్రవీణ్, కమిటీ సభ్యులుగా తోకల మక్కన్న, చెన్నబోయిన రాజేశ్వర్‌లను నియమించారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు రామగిరి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

OWNED AND EDITED BY VENKAGARI BHUMIAIAH, H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILWALPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, PUBLISHED BY YOGESH KUMAR D, H. NO. 3-167, DILAWARPUR VILLAGE & MANDAL, NIRMAL, TELANGANA-504306, PRINTER MOHAMMAD ABDUL RAHEMAN PRINTED AT MMI PRINTING PRESS 1-227/A, HIGHWAY ROAD, KONDAPALLE REBBANA, KONARAM BHEEM, ASIFABAD, MANCHERIAL, TELANGANA-504292, PUBLISHED AT H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILAWARPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, EDITOR: BDT VENKAGARI BHUMIAIAH, PRGI REGISTRATION NUMBER